



గవర్నర్ కోటాలో ఎంఎల్సీల నియామకంపై హైకోర్టు కీలక తీర్పు


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





జమ్మికుంటలో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 69 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- శుక్రవారం 8 మార్చి 2024





## మేడారం హుండీ ఆదాయం రూ.13,25,22,511



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇటీవల ముగిసిన మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహాజాతరలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ప్రక్రియ బుధవారం తో పూర్తయింది. జాతరలో ఏర్పాటు చేసిన 540 హుండీలను హనుమకొండ లోని తితిదే కల్యాణ మండపానికి తరలించి, అందులో భక్తులు వేసిన కానుకలను ఆరు రోజులుగా లెక్కించారు. లెక్కింపు ప్రక్రియలో మొత్తం 350 మందికి పైగా సిబ్బంది, మహిళా వాలంటీర్లు పాల్గొన్నారు. మొత్తం రూ.13,25,22,511 ఆదాయం సమకూరినట్లు మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేంద్రం తెలిపారు. అదనంగా 779.800 గ్రాముల బంగారంతో పాటు, 55.150 కిలో గ్రాముల వెండి ఆభరణాలు సైతం వచ్చాయి. వివిధ దేశాల కరెన్సీ నోట్లు, ఒడి బియ్యం, ఇతర కానుకలను భక్తులు పెద్ద మొత్తంలో సమర్పించారు. రెండేళ్ల కిందట జరిగిన మహా జాతరకు రూ.11,45,34,526 ఆదాయం రాగా గతంతో పోలిస్తే ఈసారి రూ.1,79,87,985 ఆదాయం పెరిగింది.

## హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తాం: సిఎం రేవంత్



**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** అభివృద్ధి కోసం భవిష్యత్ లోనూ కేంద్రం సహకారాన్ని కోరుతూనే ఉంటామని.. కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గురువారం రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్‌కు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 11.3 కిలో మీటర్లు పొడవున 6 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఎలివేటేడ్ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారమని చెప్పారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. మా పోరాటం ఫలించిందని కేటీఆర్ అంటుండు.. ఏం పోరాటం చేసిండు.. ట్విట్టర్‌లో పోస్టులు పెట్టుడా? అని సిఎం ఎద్దేవా చేశారు. మేం అనుమతులు తీసుకొస్తే ఆయన పోరాటం అని చెప్పుకుంటుండని.. కేటీఆర్‌కు తాను సూచన చేస్తున్నా.. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలన్నారు. కేటీఆర్ చచ్చుడో అభివృద్ధికి నిధులు వచ్చుడో తేలే వరకు దీక్ష చేయాలని.. ఆయన దీక్షకు దిగితే మా కార్యకర్తలే కెటిఆర్‌ను కంచె వేసి కాపాడుతారని సీఎం రేవంత్ అన్నారు.

## ఇది కాలం తెచ్చిన కరువు కానేకాదు.. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే.. : కేటీఆర్



**కరీంనగర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాలం మంచిగా కాలేదు.. కరువు వస్తున్నది.. అందరం కలిసి ఎదుర్కొందాం అంటున్నాడు. ఇది కాలం తెచ్చిన కరువు కానేకాదు.. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కదన భేరీ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.తెలంగాణలోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, రైతుల దుస్థితి పట్ల కేసీఆర్‌కు పూర్తిస్థాయి అవగాహన ఉంది. కాబట్టే రైతులకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో పని చేశారు. గతంలో ఎన్నో ఏండ్లు వరుస కరువు చూశాం. కేసీఆర్ ముందు చూపుతోనే ఆ కరువు మీద సంధించిన బ్రహ్మాస్త్రమే కాళేశ్వరం ప్రాజెక్టు. ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డలో రిపేర్లు చేసి ఉంటే చొప్పదండి, హుజురాబాద్, కరీంనగర్, మానకొండూరులో ఎండుతున్న పంటలకు ఆ నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుండే. ఈ సన్నాసి రేవంత్ రెడ్డికి మేడిగడ్డ, కాళేశ్వరం, మల్లన్నాసాగర్ అంటే ఎంటో తెల్వదు. చెరువులు నింపుడు తెల్వదు. రైతుల పంటలు కాపాడుడు అంతకంటే తెల్వదు. అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కానేకాదు.. కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఊరురా చెప్పాలి. ఇదే టైంలో కేసీఆర్ ఉండి ఉంటే ఎట్లైనా నీళ్లు తెచ్చి పంటలు కాపాడుతుండే. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే ఎల్ఎండీని ఖాళీ చేస్తున్నారు. భవిష్యత్‌లో కరీంనగర్‌లో కూడా గొంతు ఎండుతది.. డైలీ వాటర్ సప్లయి బంద్ అయితది. కేసీఆర్‌ను బద్నాం చేయడానికి ఇంత చిల్లర రాజకీయం సరికాదు అని కేటీఆర్ మండిపడ్డారు.

### 90 రోజుల్లోనే రేవంత్ ప్రజాభిమానాన్ని కోల్పోయారు..

గతంలో టీడీపీని ముంచిండు.. ఇప్పుడు కాంగ్రెస్‌ను కూడా ముంచేటట్లు ఉన్నారని ముస్లిం సోదరులు భావిస్తున్నారు. మోదీని రేవంత్ పొగడ్తలతో ముంచెత్తారు. ఆత్మగౌరవం కలిగిన ఏ తెలంగాణ బిడ్డ మాట్లాడని, ఒప్పుకొని మాటలు రేవంత్ మాట్లాడారు. రైతుబంధును కాపీ కొట్టి పీఎం కిసాన్ అని పెట్టుకున్నారు. మిషన్ భగీరథను చూసి హర్ ఘర్ జల్, మిషన్ కాకతీయను చూసి అమృత్ సరోవర్ అని పెట్టుకున్నారు. అలా అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా మారింది. అలాంటి తెలంగాణ మోడల్‌ను కించపరుస్తూ.. గుజరాత్ మోడల్‌ను చేస్తాం ఈ రాష్ట్రాన్ని అని రేవంత్ మాట్లాడుతున్నారు. గుజరాత్ మోడల్ అంటే తెల్లారితే హిందువులు, ముస్లింలు తన్నుకోవడమా..? రైళ్లల్లో పోయేటోళ్లను కాల్చి చంపుడా..? గుజరాత్ మోడల్ అంటే.. అందులో నీకేం నచ్చింది. గుజరాత్ మోడల్‌ను బేకర్ మోడల్, అట్టర్ ఫ్లాఫ్ మోడల్ అని రాహుల్ అంటాడు. అదానీని పొట్టుపొట్టు తిడుతాడు రాహుల్. నువ్వేమో అదానీతో ఆలయబలయ్ చేసుకుంటావ్. దిక్కుమాలిన పనులు చేసిన రేవంత్ ప్రభుత్వం.. 90 రోజుల్లోనే ప్రజాభిమానాన్ని కోల్పోయి ప్రజల్లో పలచన అయింది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రూ 137.76 కోట్లతో తెలంగాణలో అభివృద్ధి పనులు



**- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ**

**- బల్కంపేట్ నుండి ఆ కార్యక్రమంలో పాల్గొన్న కిషన్ రెడ్డి, జూపల్లి**

**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 , ప్రసాద్ పథకంలో భాగంగా రూ. 137.76 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలను శ్రీనగర్ నుంచి వర్చువల్ గా ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. హైదరాబాద్ బల్కంపేటలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో భాగంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ%ొా%. మన దేశంలో పర్యాటక రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేసేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కోరారు.దుబాయ్, యూరప్ , సింగపూర్ దేశాలతో పోలిస్తే భారతదేశ పర్యాటక రంగం అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని, కానీ పర్యాటక అభివృద్ధికి వేల కోట్ల రూపాయాలు కేటాయించాల్సిన అవసరం ఉందని అన్నారు. టూరిస్టుల రాక, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలుస్తుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అభివృద్ధి పనుల వివరాలను మంత్రి జూపల్లి వివరిస్తూ%ొా%. ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్ల వ్యయంతో హైదరాబాద్ లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన భవనం, తాగునీటి సదుపాయం, కెఫ్‌టేరియా, టికెట్ కౌంటర్, తదితర అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని వర్చువల్ గా ప్రధాని మోడీ ప్రారంభించారన్నారు. ప్రసాద్ పథకంలో రూ.38.90 కోట్ల వ్యయంతో గద్వాల జిల్లా అలంపూర్ లోని జోగులాంబదేవి ఆలయంలో అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం, సాంస్కృతిక భవనం, అన్నదాన సత్రం, తదితర వాటికి మోదీ ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి కోటను స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.56.81 కోట్ల వ్యయం ( ప్యాకేజీ 1) తో అభివృద్ధి చేయనున్నారని మంత్రి జూపల్లి తెలిపారు.ఇంకా భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరిత వనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్ వే నిర్మాణానికి వర్చువల్ గా శంకుస్థాపన చేశారని తెలిపారు. స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.38 కొట్ల వ్యయం ( ప్యాకేజీ -1) తో వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ప్రాంతాన్ని ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. కాగా అంతకుముందు బల్కంపేట ఎల్మమ్మ అమ్మవాకిరి మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి జూపల్లికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

# విజయాన్ని అస్వాదించండి.. బాధ్యతలను గుర్తించండి: సీఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** సికింద్రాబాద్ ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ద్వారా మన సైనికుల పిల్లలకు సేవలు అందించడం మన సైన్యానికీ దేశానికీ గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం జరిగిన ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటర్ సైన్సెస్ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ స్నాతకోత్సవ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందంటూ పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. "మీ కృషి అంకితభావం మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చాయి. ఈ రోజు నుంచి మీరు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. మీరు మీ సక్సెస్‌ను ఆస్వాదించండి, కానీ ఎప్పుడూ మీ బాధ్యతను మరిచిపోవద్దు. మీరు చేసే పనులు మీకు, మీ కుటుంబానికే కాదు మీ కాలేజీకి గుర్తింపును తీసుకొస్తాయి" అంటూ విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు



తెలియజేశారు.వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈసందర్భంగా మెరిట్ సర్టిఫికేట్లను అందజేశారు. ఎసీడీఎస్ ఆంధ్ర, తెలంగాణ సబ్ఏరియా చైర్మన్ మేజర్ జనరల్ రాకేష్ మనోచా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గవర్నర్ కోటాలో ఎంఎల్‌సిల నియామకంపై హైకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** గవర్నర్ కోట ఎంఎల్సీ పిటీషన్ పై హైకోర్టు తీర్పు వెలువరించింది. దాసోజు శ్రవణ్, కూర సత్యనారాయణలు ఎన్నికను గవర్నర్ పున:పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. గవర్నర్ కోట ఎమ్మెల్సీల పిటీషన్ పై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. గతంలో గవర్నర్ కోట ఎమ్మెల్సీల అంశాన్ని హైకోర్టు రద్దు చేసింది. మళ్లీ గవర్నర్ నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంత్రి వర్గం నిర్ణయం తీసుకొని గవర్నర్ కు తెలపాలని హైకోర్టు సూచించింది. దాశోజు శ్రవణ్, కూర సత్యనారాయణల ఎన్నిక ను గవర్నర్ పున:పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది.ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌ను హైకోర్టు కొట్టేసింది. గతంలో కోదండరాం, అమీర్ అలీఖాన్ నియమిస్తు కాంగ్రెస్ ప్రభుత్వం



గెజిట్ ఇచ్చింది. మంత్రిమండలి నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాల్సిందేనని హైకోర్టు సూచించింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీ నియామకాలు చేపట్టాలని న్యాయస్థానం పేర్కొంది. కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకాన్ని హైకోర్టు కొట్టివేసింది. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ నియామకాన్ని కొట్టివేసే అధికారం గవర్నర్‌కు లేదని వివరించింది. కేబినెట్‌కు తిప్పిపంపాలి తప్ప తిరస్కరించకూడదని గవర్నర్ కు హైకోర్టు చురకలంటించింది.

# లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు

**- దాన్ని మా లీగల్ టీమ్ చూసుకుంటుంది - బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధీమా**



**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** లిక్కర్ కేసు పెద్ద కేసు కాదని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. కేసును టీవీ సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు.. నాకు ఆమె అన్నారు. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. సీతక్కకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళ అయిన ఆమెకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో సీఎం రేవంత్ పాలన ఉందని, అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్ధతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎత్తిపోయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ డీఎన్ఏలోనే మోదీతో స్నేహం ఉందని చెప్పారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు చనిపోతుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ భాష ఎలా ఉంది.. ఆయనపై కేసులు పెట్టాలన్నారు. మహిళల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని రెండు జాతీయ పార్టీలూ చూస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవకపోతే ప్రజలకే నష్టమన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డి అన్నకి గుండెపోటు



**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** సిఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డికి గుండెపోటుకు గురయ్యారు. మార్చి 7న ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటీన ఆయన్ను చికిత్స నిమిత్తం మాదాపూర్ మెడికేర్ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు ఆయనకు స్టెంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు వెల్లడించారు. రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలను తిరుపతిరెడ్డి చూసుకుంటున్నారు.

# టిడిపి-జనసేన మరో అడుగు


**- 17న చిలకలూరిపేటలో భారీ సభ**

**- ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటన చేస్తామని వెల్లడి**

**అమరావతి,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి మరింత తీవ్ర స్థాయికి వెళ్తోంది. ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనతో ముందంజలో ఉన్న టీడీపీ జనసేన ఇప్పుడు మేనిఫెస్టోపై ఫోకస్ పెట్టింది. బుధవారం సమావేశమైన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ చర్చల్లో భాగంగా మేనిఫెస్టోపై కూడా ఓ నిర్ణయానికి వచ్చారు. టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి మేనిఫెస్టో ఈనెల 17న విడుదల చేయాలని నిర్ణయంచారు. ఇరు పార్టీల అధినేతల సూచనలతో సమావేశమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి అందులో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించారు. టీడీపీ జనసేన ఉమ్మడిగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన అచ్చెన్నాయుడు...ఐదేళ్లు రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ – జనసేన పొత్తు పెట్టుకున్నాయని వెల్లడించారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత రెండు పార్టీల మధ్య తగాదాలు పెట్టాలని వైసీపీ ప్రయత్నించిందని అవి వర్కౌట్ కాలేదన్నారు. ఈ నెల 17 న చిలకలూరిపేటలో భారీ సభ నిర్వహణకు రెండు పార్టీల నిర్ణయించినట్టు తెలిపారు. ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు భవిష్యత్ ప్రణాళికను అదే రోజు వివరిస్తామన్నారు. చరిత్ర సృష్టించేలా 10 లక్షల మందితో చిలకలూరిపేటలో సభ నిర్వహిస్తామని అచ్చన్నాయుడు అన్నారు. అనంతరం మాట్లాడిన నాదెండ్ల మనోహర్... చిలకలూరిపేట సభలో అందరూ భాగస్వామ్యం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి సభను విజయవంతం చేస్తామన్నారు. సూపర్ 6 నినాదంతో అభివృద్ధి లక్ష్యంతో ముందుకెళ్తున్నామమని తెలిపారు. పవన్ కళ్యాణ్ భద్రతా సిబ్బంది, జనసేన టీంలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలను భయపెట్టాలని ప్రయత్నం చేస్తే అది సఫలం కాదన్నారు . టీడీపీ–జనసేన ఉమ్మడి ప్రయాణం ముమ్మాటికీ రాష్ట్రం.. ప్రజలకోసమే అని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. 17న ఇరుపార్టీలు చిలకలూరిపేటలో నిర్వహించబోయే ఉమ్మడి బహిరంగ సభ నిజంగా చరిత్ర సృష్టిస్తుందన్నారు. టీడీపీ – జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు జరిగే మేలు ఏమిటో ఆ సభలోనే పవన్ కల్యాణ్ ప్రకటిస్తారన్నారు. జనసైనికులు, వీరమహిళలు ఏ విధంగా సభను విజయవంతం చేయాలో ఆలోచించుకొని, ఎవరికివారు ముందుకు రావాలని కోరారు. ప్రతి గ్రామంనుంచిప్రజలుస్వచ్ఛందంగాసభకు తరలివచ్చేలా జనసైనికులు పట్టుదలగా పని చేయాలన్నారు.



# పదేళ్లుగా మనలను గొర్రెలుగా మార్చారు




**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊపిరి లాంటిది. ఈ విషయంలో తల్లి లాంటి ఏపీని జగన్ వెన్నుపోటు పొడిచారని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రతిపక్ష నేతగా నిరాహార దీక్షలు చేశారు. మూకుమ్మడి రాజీనామాలు చేద్దామన్నారు. సీఎం అయ్యాక ఆ పార్టీ నుంచి ఒక్కరైనా రాజీనామా చేశారా? ఒక్కటైనా నిజమైన పోరాటం చేశారా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తానని వైఎస్ షర్మిల ప్రకటించారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా హోదా రాలేదన్నారు. పదేళ్ల నుంచి ఆంధ్రవారిని అధికార పార్టీలు గొర్రెలను చేశారని షర్మిల ధ్వజమెత్తారు. హోదా కోసం సింహాల మాదిరిగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. హోదా గురించి తలచుకొని షర్మిల కన్నీటి పర్యంతం అయ్యారు. 'గత పదేళ్ల నుంచి హోదా ఊసే లేదు. హోదా అంటే ఏంటోనని వింతగా చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఉద్యమించాలని నిర్ణయించు కుంది. ప్రత్యేక హోదా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడకుంటే హోదా రాదు. 10 ఏళ్లలో ఏ ఒక్కరూ పోరాటం చేయలేదు. ప్రత్యేక హోదా – ఆంధ్రుల హక్కు. ప్రజలు గొర్రెల లెక్క కాదు...సింహాల లెక్క బ్రతకాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. గొర్రెలను బలి ఇస్తారు.. సింహాలను బలి ఇవ్వరు అన్నారు. హోదా విషయంలో 10 ఏళ్లు గొర్రెలు అయ్యాం. మొదటి 5 ఏళ్లు చంద్రబాబు గొర్రెలను చేశాడు. తర్వాత 5 ఏళ్లు జగన్ గొర్రెలను చేశాడు. ఇప్పుడు మనం గొర్రెలం కాదు సింహాలం. సింహాల మాదిరిగా పోరాటం చేయక పోతే హోదా రాదు. పోరాడితే పోయేది ఏమి లేదు..బానిస సంకెళ్లు తప్పా అని' షర్మిల విరుచుకుపడ్డారు. 'తాము ఇన్నాళ్లు మంచిగా ఉన్నది చాలు. అలా ఉంటే హోదా ఇచ్చారా ? మంచిగా ఉంటే పోలవరం కట్టారా? ఆంధ్రులను మోసం చేసిన ప్రధాని మోదీ ఒక డిఫాల్టర్. మోదీ ఒక కేడీ. హోదా వచ్చి ఉంటే మన రాష్ట్రం డెవలప్ అయ్యేది. హోదా వస్తే రూ.15 లక్షల కోట్లు వచ్చేవి. జగన్ అన్నకి అభివృద్ధి ధ్యాస లేదు. మాట ఇచ్చి మడత పెట్టిన ఘనత జగన్‌ది. జలయజ్ఞం కింద వైఎస్ఆర్ కట్టిన ప్రాజెక్టలకు దిక్కులేదు. వ్యక్తిగత రాజకీయాల కోసం ఏపీకి రాలేదు. రాజకీయాలు కావాలంటే 2019లో ఇక్కడ పార్టీ ఏర్పాటు చేసే వారం. హోదా సాధన, విభజన సమస్యల కోసం వచ్చా. రాహుల్ గాంధీ ఇచ్చిన మాటతో వైఎస్ఆర్ బిడ్డ ఆంధ్రలో అడుగు పెట్టింది. హోదాపై మొదటి సంతకం పెడతా అని హామీ ఇచ్చారు. అందుకే వచ్చా. హోదా లేకపోతే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి లేదు. హోదా రాకపోతే మన బిడ్డలకు ఉద్యోగాలు రావు. రాష్ట్రానికి భవిష్యత్ లేదు. ప్రత్యేక హోదా ఊపిరి అవుతుంది. ఊపిరి లేకుండా బ్రతక గలమా ? రాష్ట్రమంతా కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలి. రాష్ట్రానికి సిగ్గు చేటు. ఇతర రాష్ట్రాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుంది. రాష్ట్రం మాత్రం 25 ఏళ్లు వెనక్కి వెళ్ళింది. ఆంధ్ర అభివృద్ధి నాది అని మోదీ హామీ ఇచ్చారు. ఏ ఒక్క హామీ సైతం నెరవేర్చలేదు అని' వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదని వైఎస్ షర్మిల అన్నారు. అలా అనుకుంటే 2019లోనే ఇక్కడ అడుగు పెట్టేదాన్ని అని వ్యాఖ్యానించారు. పోరాడకపోతే ప్రత్యేక హోదా ఎప్పటికీ రాదన్నారు. ఈ క్రమంలో ఆమె భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. 'హోదా మన బిడ్డల హక్కు.. దీన్ని ఎంతమంది పట్టించుకున్నారు? అది వచ్చి ఉంటే రాజధాని, పోలవరం మనం కట్టుకోలేమా? మన రాష్ట్రం ఎందుకు తక్కువగా ఉండాలి. ప్రత్యేక హోదా ఇస్తానన్న ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ. ఆయన మాటతోనే నేను ఏపీ రాజకీయాల్లో అడుగుపెట్టా అని షర్మిల అన్నారు.

# ఈ నెల 31వ తేదీలోగా గ్యాస్ కనెక్షన్లకు ఈకెవైసి పూర్తి చేసుకోవాలి !

**ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్ సంఘం అధ్యక్షుడు జగన్‌మెహన్ వెల్లడి**



**హైదరాబాద్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని డిబిటిఎల్ లబ్ధిదారులంతా తమ ఈకెవైసి సంబంధిత ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్ వద్ద ఈ నెల 31వ తేదీలోపు అంతకంటే ముందే పూర్తి చేయాలని తెలంగాణ ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మెహన్ రావు తెలిపారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ నోటిపై చేసిందని, ప్రజల అవగాహన కోసం విస్తృత ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు.అదే విధంగా సార్వత్రిక వేళ కేంద్ర కేబినెట్ ఉజ్వల లబ్ధిదారుల వంట గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్నా రాయితీ గడువును పొడిగించింది. ఒక్కో సిలిండర్‌పై ప్రస్తుతం రూ. 300 సబ్సిడీ అందిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి ఈ రాయితీని వర్తింపజేసింది. ఏడాదికి 12 సిలిండర్లు వరకు ఈరాయితీ లభిస్తుంది. దీంతో 10 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. కాగా ప్రభుత్వ ఖజానాపై రూ. 12వేల కోట్ల భారం పడుతుందని చెప్పారు.

# మహా శివరాత్రి ఆధ్యాత్మిక, సంస్కృతిక సమ్మేళన మహోత్సవానికి తరలిరండి

### - ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేష్ రెడ్డి

**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ జిల్లా హయగ్రీవ చారి మైదానంలో నేడు మహాశివరాత్రి ఆధ్యాత్మిక, సంస్కృతిక సమ్మేళన కార్యక్రమానికి తరలివచ్చి ఆహా మహాదేవుని ఆశీస్సులు పొందాలని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మహా శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను ఇండస్ చైర్మన్ రాకేష్ రెడ్డి, విహెచ్ పి జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డితో కలిసి సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ..నేడు (శనివారం) హయగ్రీవా చారి గ్రౌండ్స్ లో సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభం కానున్న వేడుకలు. తెల్లవారు జామున 4 గంటల వరకు నిర్విరామంగా సాగనున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం.రాత్రి 6:30 నిమిషాలకు శివ పార్వతీ కళ్యాణం తో ప్రారంభం కానున్న వేడుకలు, బ్రహ్మ శ్రీ డాక్టర్ ఎల్. వీ.



గంగాధర శాస్త్రి , రాధమనోహర్ ప్రవచనాలు ఉంటాయి.వందేమాతరం శ్రీనివాస్, చరణ్ అర్జున్, సత్యభామా, సాకేత్, లక్ష్మి, అనిత ల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో సపత హారతి, పేరని శివ తాండవం ఉంటాయి. ప్రతీ ఏడూ ఓరుగల్లుకు పూర్వ వైభవం కోసం కృషి చేస్తున్న విశిష్ఠ వ్యక్తుల సన్మానం కోసమై 8 మందికి "కాకతీయ పురస్కారం" అందజేయడం జరుగుతుందని, మన ఓరుగల్లు కే ఒక మణిహారం అయిన ఈ ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనను ప్రజల్లోకి తీసుకెళ్లడం లో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. యువత, భక్తులు, మహిళలు అందరూ పాల్గొనాలని, 50 వేలకు సరిపడా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతీ ఏడూ సహకరించినట్టుగానే పోలీస్ శాఖ వారు, జి డబ్ల్యూ ఎం సి సిబ్బంది, సామాన్య ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవి నాయక్, రాములు, కార్యక్రమ ఇన్చార్జి అభిషేక్, సుకాంత్, దీపక్, భూపతి రాజు, మహేష్, మంద సురేష్, అమ్రిష్, నరేందర్, దేవయ్య, కుచన క్రాంతి, ప్రమోద్ రెడ్డి లు పాల్గొన్నారు.

# పెద్ద చెరువు ఆయాకట్ట కోసం రూ. 20 కోట్ల నిధులతో పునరుద్ధరన, సుందరీకరణ



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ హసన్పర్తి మండలంలోని నాగారం పెద్ద చెరువు ఆయాకట్ట పునరుద్ధరణ, సుందరీకరణ పనుల కోసం సుమారు రూ. 20 కోట్ల నిధులతో చేపట్టిన కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో నాగారం పెద్ద చెరువు ఆయాకట్ట నాగారం పెద్ద చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించడం సంతోషకరమని, దీని త్వరలోనే పూర్తి చేసి ప్రజల మధ్యలోకి తీసుకొస్తామని వారన్నారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిల్లి వెంకట్ రెడ్డి, పెద్ద చెరువు చైర్మన్ రాజు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మాట్లాడారు. స్థానిక గ్రామ నాయకులు,ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగేళ్లపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సౌరం చరణ్, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఈఈ, డిఈ, ఏఈ , ఎమ్మార్వో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉమెన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు







**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉమెన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఉమెన్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహి స్తున్నారని, ఇదే విధం గా ముమ్మందు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యం లో వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించగా ప్రతిభ చాటిన మహిళా ఉద్యోగులకు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఉమెన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నీరజ, వైస్ ప్రెసిడెంట్ మాధవి లత, అధికారులు వసంత లక్ష్మి, రామ్ రెడ్డి, శ్రీనివాస్, భాను ప్రసాద్, శ్రీను, హరి ప్రసాద్, ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# చైతన్య డీమ్డ్ టు బి విశ్వ విద్యాలయంలో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలో గురువారము "అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని, మహిళా అధ్యాపక, అధ్యాపకేతర బృందం,విద్యార్థిని లు అనేక కార్యక్రమాలను, తమ ఆట పాటలతో,సాహితి,సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో వేదికపైకి ప్రొఫెసర్ బి.ఎస్. అనురాధ,డీన్,ఎకడమిక్ అఫైర్స్, ప్రొఫెసర్ ఎస్.కవిత,డీన్, అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసర్ ఎస్. సుమ, డీన్, అడ్మిషన్స్ వి. పద్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడు తూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారని, మహిళల హక్కులను ప్రోత్సహించడానికి అంకితం చేయబడిందని, మహిళలు సాధించిన పురోగతిని గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఈ దినోత్సవ చరిత్ర 1987 నాటిదని వారి ఓటు హక్కు కోసం పోరాటానికి మహిళల సమూహం మొదటిసారిగా నిర్వహించడం జరిగిందని, వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ సి. మమతా రెడ్డి,ప్రముఖ హృద్రోగ చికిత్స ప్రవీణురాలు పాల్గొని మాట్లాడుతూ.. లింగ సమానత్వాన్ని సాధించడం కేవలం మహిళలకే కాకుండా మొత్తం సమాజానికే మేలు చేస్తుందని,దీని వల్ల ఆర్థిక వృద్ధి,అభివృద్ధి మెరుగైన కుటుంబ జీవిత ఫలితాలకు దారితీస్తుందని తెలిపారు. లింగ సమానత్వానికి మనందరి సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. చైతన్య విశ్వవిద్యాలయంలో ఈ మహిళా బృందం నిర్వహించుచున్న అనేక వేడుకలకు తాను పాల్గొనడం చాలా సంతోష దాయకంగా వుందని మమతా రెడ్డి తెలిపారు. ఈ మహిళా దినోత్సవాన్ని మా చైతన్య విశ్వవిద్యాలయ మహిళా బృందం నిర్వహించినందులకు చాలా సంతోషంగా ఉందని కులపతి డాక్టర్ సిహెచ్.వి.పురుషోత్తమ్ రెడ్డి,చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి,ఉపకులపతి ప్రొఫెసర్ జి. దామోదర్,రిజిస్ట్రార్,ప్రొఫెసర్ రవీందర్ పేర్కొన్నారు.ఈ వేడుకలు సాయంత్రం వరకు జరిగినాయని ప్రజా సంబంధాల అధికారి గాదె రాంబాబు, పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



**హనుమకొండ జిల్లా స్టాపర్,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల పర్యటన నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వరంగల్ నిట్ గెస్ట్ హౌస్ కు చేరుకోగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఆర్డీవో వెంకటేష్ గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

# అరోరా డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఘనంగా ట్రెడిషనల్ డే సెలబ్రేషన్స్




**కేయూ క్రాస్ రోడ్, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ లోని అరోరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం ట్రెడిషనల్ డే ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రోజూ కళాశాలకు ఆధునిక దుస్తుల్లో వచ్చే విద్యార్థులు .ఈ రోజు మాత్రం సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చారు. భారతీయ సంస్కృతికి ఉట్టబడే విధంగా దుస్తులు ధరించి సందడి చేశారు. నృత్యాలు, ఆటపాటలతో హోరెత్తించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రఘోత్తం రెడ్డి,డైరెక్టర్ ప్రణవ్ రెడ్డి,ప్రిన్సిపాల్ ఎన్ రజిని, అధ్యాపకులు అశోక్, సతీష్, కవిత, సంతోష్ రమేష్, సుమలత, జమాల్, వీరభద్ర స్వామి, నవీన్ రాజ్, సత్య ప్రకాష్, శ్రీనివాస్,భారీ సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

### - స్వార్థరాజకీయాల కోసం పార్టీ నుంచి వెళ్లినవారితో నష్టమేమీలేదు

### - పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**పరకాల,మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బి.ఆర్.ఎస్.పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండలోని వారి నివాసంలో వారు మాట్లాడుతూ. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని, స్వార్థరాజకీయాల కోసం పార్టీ నుంచి వెళ్లినవారితో నష్టమేమీ లేదన్నారు. పార్టీ నుంచి ఎందుకు వెళ్లామా అని వారు కూడా తమ తప్పును గుర్తించే రోజు దగ్గరలోనే ఉందన్నారు. పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దని, పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు. బి.ఆర్.ఎస్.పార్టీ నాయకులను, కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడుతూ. పార్టీ మారాలని చేస్తున్న బలవంతపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అబద్దాల పునాదులపై అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లోక్సభ ఎన్నికల్లో బీఆర్ఎస్కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



# జిల్లాలోని అన్ని బ్యాంకుల కంటే ఆత్మకూర్ బ్యాంకును అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలి

### - జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ రవీందర్రావు

**ఆత్మకూర్, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని అన్ని సహకార కేంద్ర బ్యాంకుల కంటే ఆత్మకూరు సహకార బ్యాంకు ను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని డిసిసిబి చైర్మన్ రవీందర్రావు అన్నారు. గురువారం ఆత్మకూరు డిసిసి బ్యాంక్ ను సందర్శించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షులు మార్నింగ్ రవీందర్రావు బ్యాంకు డిపాజిట్లు మరియు రికవరీ గురించి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుండి రావలసిన క్రాప్ లోను మరియు దీర్ఘకాలిక లోను వసూలు చేయుట గురించి మాట్లాడుతూ ఆత్మకూర్ బ్రాంచిని ముందుకు నడిపించాలని కోరుతూ పలు సూచనలు చేసినారు. ఇట్టి సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ ఎం శ్వేత,ఎన్ రాజేష్ సూపర్వైజర్ సంఘాల సీఈఓ లు జి రాజమోహన్ పి ఓం రెడ్డి ఓ లక్ష్మయ్యబి శ్రీనివాస్ మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర,మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఆర్నకొండ గ్రామానికి చెందిన మాజీ కార్యకర్త కీ "శే భాసం మల్లయ్య గారి భార్య భాసం కనకమ్మ ఆమెకు అనారోగ్యగా ఉందని చొప్పదండి మండల మహిళా అధ్యక్షురాలు చిలుమల స్వప్న శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్న గారి దృష్టి తీసుక వెళ్లగా వేంటేనే స్పందించి ఆమె హాస్పిటల్ ఖర్చులకు 10000 రూపాయలు అందించడం జరిగింది కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆల్ కార్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**- గౌరవాధ్యక్షులుగా తుంబూరు దయాకర్ రెడ్డి**




**ఖమ్మం, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఖమ్మంజిల్లా ఆల్ కార్ డ్రైవర్స్ అసోసియేషన్ 2024-2026కి గాను నూతన కమిటీ ఎన్నికైంది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు, ముఖ్యసలహాదారులు ఎన్. విజయవర్మ ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా పి. పాపారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా డి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా ఎన్. జీవనసాగర్, కోశాధికారిగా సాయి కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డి. చంటి, జిల్లా సహాయ కార్య దర్శులుగా ఎస్.కె. రసూల్, జి.స్వామి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.కె. దస్తగిరి, సత్తిబాబు, బాబు, మధు, విజ య్, వీరా, సురేష్ తదితరులు ఎన్నికయ్యారు.దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి తరఫున అసోసియేషన్ అభివృద్ధికి సహాయసహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

# పిఆర్‌టియు తెలంగాణ సభ్యత్వ నమోదు ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి ఎస్.కే కుద్దుస్....



**ఖమ్మం, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**నేడు పి.ఆర్.టి.యు తెలంగాణా ఖమ్మం జిల్లా శాఖ అధ్వర్యంలో పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోద్ కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి ఎస్.కే కుద్దుస్ ప్రారంభించారు . ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకుని అనుగుణంగా పరిష్కారం కొరకు జిల్లా శాఖ కృషి చేస్తున్నమని జిల్లా అద్యక్షులు మట్టా శ్రీనివాసరావు అన్నారు . రూరల్ , అర్బన్ మండలలోని పలు పాఠశాలలు సందర్శించిన జిల్లా బృందం హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వం లో అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని అందుకోసం ఉపాధ్యాయులందరు పి.ఆర్.టి.యు తెలంగాణ సంఘానికి వెన్నుదన్నుగా నిలిచి సంఘము పటిష్టత కు పాటు పడాలని కోరారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని అనిల్ కుమార్ , జిల్లా బాధ్యులు భూక్యా వీరేంద్ర , నవీన , రాష్ట్ర మహిళా కార్యదర్శి చావా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు .

# పరకాల ఎమ్మెల్యేకి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



**పరకాల, మార్చి7 (పీసిడబ్ల్యూ న్యూస్):**పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ పరకాల బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ కు స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలనిప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం ఏర్పాటు చేయాలనిగ్రామాల నుండి వచ్చి చదువుకునే విద్యార్థులకు సరైన సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని పరకాల లో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకివినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ స్టూడెంట్ నాయకులు పాల్గొన్నారు.

# అధికారం చేతిలో ఉందని నిన్నటి దాకా హల్ చల్ చేశారు ?



**తొర్రూర్,మార్చ్ 6.(పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్నటి అధికారం నేడు అంధకారంగా మారింది. ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నిన్నటికి నేటికి తేడా తెలుస్తుంది.నిన్నటి వరకు ఉన్నవారు ఆడించారు - ఇకనుండి ఉన్నవారు జాడిస్తారు.గతాన్ని ఒకసారి నెమరు వేసుకుంటే ఎన్నికలకు ముందు అధికారం వారి చేతిలో ఉందని ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను వారి ఇష్ట రాజ్యంగా మేమే గెలుస్తామని టిఆర్ఎస్ పార్టీ అధికారాన్ని చూసుకొని వచ్చేవారికి చెమటలు పట్టించేలా చేశారు. భారీ బహిరంగ సభలలో ర్యాలీగా వస్తున్న కాన్వాయ్ లను అంధకారం చేసేందుకు తొర్రూరు పట్టణంలో గల వీధి దీపాలను ఆర్పీయడం. సమయం అయిపోయింది అన్న పేరుతో వాహనం నుండి దింపి పరుగులు పెట్టించడం జనాలు అంత తొందరగా మరిచిపోరు అని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇది నిన్నటి మాట కానీ నేడు అధికారం అస్తవ్యస్తంగా ఎటు పోలేని దుస్థితిలో అధికారంలో ఉన్న వారే వారికి దేవుడు లాగా కనిపిస్తున్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో మొదటినుండి శ్రమించి పనిచేసిన వారు ఎందరో ఉన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ఎలాంటి పదవులు ఇవ్వవద్దని మొదటినుండి కష్టపడి పని చేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కష్టాలను అనుభవించి ఎన్నో అవస్థలకు ఓర్చుకొని 50,000 మెజార్టీతో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ నుండి మామిడాల యశస్విని రెడ్డి ,పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిల కృషి పట్టుదల వారికి సహకరించిన నియోజకవర్గ ప్రజలందరి శ్రమ ఫలితమే మన నియోజకవర్గ అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుంది అంటున్నారు.తొర్రూరు మున్సిపాలిటీలో గల మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు దొంగరి రేవతి శంకర్, బిజ్జాలమాధవి అనిల్, టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ చేరుతున్నారు . కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమాన్లు ఝాన్సీ రెడ్డి , పాలకుర్తి నియోజకవర్గంశాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఎంతోమంది ఈ పార్టీలో చేర్చుకోవద్దని తెలిపినప్పటికీ కూడా వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. మరి వీరు పార్టీ కోసం కష్టపడి పని చేస్తారా అనేది చూడాల్సి ఉందని కొందరు పేర్కొంటున్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, గోదాంని ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే





**హసన్‌పర్తి, మార్చి 07(పి సి డబ్ల్యు న్యూస్):** హనుమకొండ జిల్లా హాసన్ పర్తి మండల కేంద్రము లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని మరియు గోదాం ని పాక్స్ ఛైర్మన్ బిల్లా ఉదయ్ రెడ్డి గారితో కలిసి ప్రారంభించిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనంతరం అదే భవనంలో డిసిసిబి బ్యాంక్ నిర్మాణం కోసం గదులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, ఆత్మ చైర్మన్ కుందుకూరి చంద్రమోహన్, ఎంపిపి కేతపాక సునీత, స్తానిక కార్పోరేటర్ గూరుమూర్తి శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్స్ తో పాటు ఏ. వో అనురాధ గారు, రైతులు సంఘాల నాయకులు, రైతులు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**ఖమ్మం, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవ సదస్సును నిర్వహించారు . ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య , ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ప్రభుత్వం పురుషులతో పాటుగా మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్ విజయలక్ష్మి మరియు డాక్టర్ యలమూడి కావ్యచంద్ , అఖిల కంటి ఆసుపత్రి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత కొనసాగుతున్నదని ట్రోలింగ్ పేరుతో మహిళా వేధింపులు అధికమవుతున్నాయని ఆర్థిక అసమానతలు లేకుండా సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే మహిళా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు . మహిళలు చైతన్యవంతంగా ఆలోచించి సమాన అవకాశాల కోసం చట్టసభల ద్వారా కొట్లాడాలని అప్పుడు మాత్రమే మహిళా దినోత్సవానికి సార్ధకత ఉంటుందని అన్నారు . మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు . ఈ సదస్సులో సీనియర్ మహిళ పెన్షనర్ల్ను సన్మానించారు . రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కె అరుణ భాయ్ , శ్రీమతి లలిత తదితర సీనియర్ ఫ్యామిలీ పెన్షనర్ల్ను సన్మానించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాంబశివరావు , తాళ్లూరి వేణు , జనార్ధన్ , డీకే శర్మ , పట్టణ నాయకులు రాధాకృష్ణ , హనుమంతరావు , వెంకట్ నారాయణ , రమేష్ , బసవరావు , యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**ఖమ్మం, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 07/03/2024 న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం పాత డి ఆర్ డి ఎ ఆఫీస్ నందు ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మద్ది శ్రీనివాస్ రెడ్డి గారు లీగల్ అడ్వైజర్ మాట్లాడుతు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని,ప్రభుత్వం నుండి వచ్చే ప్రయోజనాలను ఉపయోగించుకోవాలని కోరారు, , తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల గారు గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డి ఎ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి, 40%పి ఆర్ సి ఇవ్వాలి , సిపి ఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ అమలు చేయాలి, 317జి ఓ ను రద్దు చేయాలని కోరారు ,,శ్రీమతి శిల్ప దేవి. ఐ.కాంతా కుమారి, కె.మౌనిక, భావాని గారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని ఉంటారని మగవారితో సమానంగా ఉంటున్నారని ప్రస్తుత సమాజంలో ఆడవాళ్లదే పై చేయిగా ఉండాలని అన్నిట్లో వాళ్లే విజయం సాధించాలని కోరారు. మరియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెద్ద బోయిన నాగరాజు బెజ్జంకి ప్రభాకరాచారి, ప్రవీణ్, షరీఫ్, శ్రీకాంత్ వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళా అధ్యక్షురాలు వెంకటరమణ,రాష్ట్ర నాయకు రాలు జె. జయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. కోటయ్యా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మహిళ ఉద్యోగస్తులకు లెమన్ స్పూన్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్, రన్నింగ్ తదితరుల గేమ్స్ను నిర్వహించి ఫస్ట్, సెకండ్ ప్రైజ్ ల ను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

# చిట్యాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం"

**చిట్యాల. మార్చి7(పిసిడబ్ల్యు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిట్యాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ సేవలందిస్తున్న ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తపల్లి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ..మహిళా హక్కుల సాధన, రాజకీయ ఆర్థిక స్వావలంబనలో భాగంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉనికిని చాటుకుంటున్నారని అభివర్ణించారు.సమాజంలో సగభాగమైన మహిళా మణులు పురుషులతో సమానంగా పోటీగా పోటీ పడుతున్నారని అన్నారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులు సిబ్బందికి శాలువాతో సత్కరించి మేముంటో అందించారు.సన్మాన గ్రహీతల్లో పారిశుధ్య కార్మికురాలు పుల్ల సారమ్మ, రెవెన్యూ శాఖ తాసిల్దార్ కార్యాలయంలో అటెండర్ సరస్వతి, వెటర్నరీ సిబ్బంది సుజాత శెట్టి, చిట్యాల సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారిని సంజన, చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు నీలిమారెడ్డి, ఐకెపి(సీసీ) రమణాదేవి.చిట్యాల సివిల్ దవాఖాన ల్యాబ్ టెక్నీషియన్ సింధు, చిట్యాల వ్యవసాయ విస్తరణ అధికారి సన్నీ, పంచాయతీ కార్యదర్శి(లక్ష్మీపూర్ తండా)సరిత, పోలీస్ కానిస్టేబుల్ (షీ టీం) కోమల, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద, ఎంపీపీ, గుమ్మడి శ్రీదేవి గార్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ ప్రధానకార్యదర్శి చింతల మహేందర్, ఉపాధ్యక్షుడు కాట్రేవుల ఐలయ్య, కోశాధికారి వెల్దండి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి గుర్రం శంకర్, సలహాదారులు గజనాల మహేందర్, పుల్ల రవితేజ, చింతల రాజశేఖర్, చింతకింది శ్రీనివాస్, సామల ధనుంజయ, కోడెల సదానందం, బోల్ల రాజేందర్ పాల్గొన్నారు.



# ఖమ్మం టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**ఖమ్మం, మార్చి 07(పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ఖమ్మం టీఎన్జీవో భవన్ లో సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగినది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి 800 మంది మహిళలు హాజరు కావడం జరిగినది. సాంస్కృతిక కార్యకలాపాలతో ఖమ్మం జిల్లాలో కనివిని ఎరుగని రీతిలో సఖీ జాతీయ మహిళా మండలి తరపున అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో 86 కుటుంబాలకు సేవ చేసిన మహిళలకు సేవా రత్న మహిళా పురస్కార అవార్డు 2024 ను అందజేయడం జరిగినది. మహిళలు సేవారంగంలో రాణిస్తున్నారని, సఖీ జాతీయ మహిళా మండలి తరపున విద్యా వైద్య ఆరోగ్యం ఉపాధి కల్పనా దిశగా ప్రయత్నం చేస్తున్నారని మహిళల రుణం తీర్చుకోలేనిదని నరాల సత్యనారాయణ తెలియజేశారు. మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చక్కని ఆటపాటలతో మంచి ప్రదర్శన చేసి సఖీ జాతీయ మహిళా మండలి యొక్క ఉన్నత్యాన్ని చాటి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ నాగమణి, నేషనల్ ప్రెసిడెంట్ మాధవి, నేషనల్ జనరల్ సెక్రెటరీ కుసుమ, నేషనల్ కన్వీనర్ నాగమణి, నేషనల్ ట్రెజరర్ సంధ్య, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ లు శ్రీలత, కృష్ణవేణి, నేషనల్ కో- కన్వీనర్ గిరిజ, నేషనల్ జాయింట్ సెక్రటరీ సీతక్క, నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీస్ సునీత, దుగ్గిరాల కోటేశ్వరి, నేషనల్ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ శ్రావణి, జిల్లా అధ్యక్షురాలు ప్రీతి, ప్రోగ్రామింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మి, స్టేట్ కోఆర్డినేటర్ షకీనా, స్టేట్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, స్టేట్ కన్వీనర్ నాగమణి, స్టేట్ జనరల్ సెక్రటరీ నిలవేణి, చాంద్ భీ, స్టేట్ జాయింట్ సెక్రటరీ పద్మజ, స్టేట్ కమిటీ మెంబర్స్ నాగమణి, సోనీ, దీప్తి, మాధవి, నేషనల్ అడ్వైజర్ ప్రేమ కుమారి, రాజేశ్వరి, నిర్మల, నాగమణి, వెంకటరమణ, విజయలక్ష్మి, సువర్ణ, షమీం, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**- పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ**

**- 516 బృందాలతో మార్చి 11 నుంచి మార్చి 24 వరకు కుష్టు రోగుల గుర్తింపు క్యాంపెయిన్**

**- కుష్టు వ్యాధి ప్రాథమిక నిర్ధారణ కోసం లక్షణాలపై విస్తృత ప్రచారం చేయాలి**




**పెద్దపల్లి జిల్లా, మార్చి 07:(పిసిడబ్ల్యూ న్యూస్):**కుష్టు వ్యాధి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్టు వ్యాధి నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ మాట్లాడుతూ,లి జిల్లాలోని కుష్టు రోగుల నిర్ధారణ కోసం మార్చి 11 నుంచి మార్చి 24 వరకు 516 బృందాలతో కుష్టు రోగుల గుర్తింపు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని, ప్రతి వైద్య బృందంలో ఒక ఆశ కార్యకర్త సభ్యులుగా ఉంటారని, 116 సూపర్ వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని, 2 లక్షల 2 వేల 297 ఇండ్లలో గుర్తింపు క్యాంపెయిన్ జరుగుతుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.కుష్టు వ్యాధిపై ప్రజలలో ఉన్న అపోహలు తొలగించేందుకు అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని, కుష్టు వ్యాధి నియంత్రణపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని సూచించారు.కుష్టు రోగుల గుర్తింపు క్యాంపెయిన్ నిర్వహించే సిబ్బందికి అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని, ప్రభుత్వం నిర్దేశిత నమూనాల్లో రిపోర్టులు సకాలంలో సమర్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు.వైద్య బృందాలు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఇంటింటికి తిరిగి ఇంటిలో ఉన్న సభ్యులందరినీ ఏమైనా స్పర్శ లేని (మొద్దు బారిన), రాగి రంగులో కనపడే మచ్చలు ఉన్నాయా అని పరిశీలించి, అనుమానిత లక్షణాలను గుర్తించిన వారి జాబితాను స్థానిక వైద్యాధికారికి సిఫార్సు చేస్తారని, స్థానిక వైద్యాధికారి వీరిని పరిశీలించి వారికి కుష్టు వ్యాధి సోకినది, లేనిది నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. కుష్టి వ్యాధిని ముందస్తుగానే గుర్తిస్తే చికిత్స చేయడం సులభం అవుతుందని, కుష్టు వ్యాధి పట్ల ఉన్న సోషల్ స్టిగ్మా కారణంగా లక్షణాలను దాచిపెడితే అంగవైకల్యం వస్తుందని అన్నారు. కుష్టి వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రచారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. కుష్టు వ్యాధి సోకిన వారికి ఉచితంగా ప్రభుత్వం నుండి మందులు అందిస్తామని, ఒకటి నుండి ఐదు సర్శ లేని మచ్చలు కలవారికి ఆరు నెలల ఎం.డి.టి. (బహుళ ఔషద) చికిత్స, అంతకంటే ఎక్కువ మచ్చలు కలిగిన వారికి 12 నెలల చికిత్స అందించబడుతుందని అన్నారు.కుష్టు వ్యాధి లక్షణాలను తొందరగా నిర్ధారించుకొని మందులు వాడడం వలన పూర్తిగా కోలుకోవచ్చునని, వ్యాధిని సకాలంలో గుర్తించకుంటే అంగవైకల్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. అంగవైకల్యం ఏర్పడిన తరువాత మందులు వాడినప్పటికీ కుష్టు వ్యాధి నయమవు తుంది కానీ, అంగవైకల్యం అలానే ఉంటుందని, అందువల్లన ఆశాలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అనుమానం ఉన్నవారు సందేహ పడకుండా వారితో పరీక్ష చేయించుకొని, వైద్య బృందాలకు సహకరించాలని కోరారు.కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని, ప్రస్తుతం మన జిల్లాలో 63 మంది చికిత్స పొందుతున్నారని అన్నారు. కుష్టు వ్యాదిపై ఎటువంటి అపోహాలకు గురికావద్దనీ, ప్రతి ఒకరు ఆశాలు ఇంటికి వచ్చినప్పుడు పరీక్షలకు సహకరించాలని కోరారు. కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చని, కుష్టు వ్యాధి లక్షణాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని గ్రామ పంచాయతీలలో, పట్టణాలలో, అంగన్వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ పి.కృపా బాయి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డిపిఎంఓ పి.జయాకర్, జడ్పీ సీఈఓ కే.నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.ఏ.ఎస్.పి.లత, జిల్ల సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలు ఎన్నికల కమీషన్‌కు సమర్పణ**



**పెద్దపల్లి జిల్లా, మార్చి 07: (పిసిడబ్ల్యూ న్యూస్):**రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు.గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా అవసరమైన మేర పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల కమిషన్ కు ప్రతిపాదనలు పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమీషన్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత మరో మారు ఓటరు జాబితా సవరణ ఉంటుందని, ఓటర్ జాబితాలో అవసరమైన మార్పులు ఉంటే ముందస్తుగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. గతంలో జనవరి 1వ తేదీ ప్రామాణికంగా చేసుకొని సంవత్సరానికి ఒకసారి ఓటర్ జాబితా సవరించడం జరిగేదని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి 3 నెలలకు ఒకసారి ఓటర్ జాబితా అప్ డేట్ చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఒకే ఇంటిలో అధిక సంఖ్యలో ఓటర్లు నమోదు జరిగితే క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి ధృవీకరిస్తున్నామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ మంథని జేఎన్టీయూ కళాశాలలో, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ మంచిర్యాలలో నిర్వహించడం జరుగుతుందని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ ప్రతినిధి సి.రవీందర్, సిపిఐ పార్టీ ప్రతినిధి టి.సదానందం, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శశిభూషణ్, భాజాపా పార్టీ ప్రతినిధి పి. సంపత్ రావు, తెదేపా పార్టీ ప్రతినిధి తిరుపతి, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి యూ.రాజ్ కుమార్, బిఎస్పీ పార్టీ ప్రతినిధులు దుర్గయ్య, అనిల్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ సిబ్బంది ఈశ్వర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమలను ప్రారంభించిన పెద్దపల్లి ఎమ్మెల్యే

**- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు**





**పెద్దపల్లి జిల్లా, ఓదెల: మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో గురువారం రోజున గూడెం గ్రామంలో నూతన అంతర్గత సీ సీ రోడ్డు నిర్మాణం కోసం (ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్) ఐదు లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు. అనంతరం గుంపుల గ్రామంలో నూతన అంతర్గత సీ.సీ. రోడ్డు నిర్మాణం కోసం పది లక్షల రూపాయల నిధులతో,శానగొండ గ్రామంలో నూతన అంతర్గత సీ.సీ. రోడ్డు నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయల నిధులతో,జీలకుంట గ్రామంలో నూతన అంతర్గత సీ.సీ. రోడ్డు నిర్మాణం కోసం పది లక్షల రూపాయల నిధులతో,మడక గ్రామంలో నూతన అంతర్గత సీ.సీ రోడ్డు నిర్మాణం కోసం 14 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేశారు.అలాగే ఓదెల మండలం,రూప్ నారాయణపేట గ్రామంలో 6 గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించినప్పుడే గ్రామాలు పట్టణాల వలె అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశారని మిగతా గ్యారంటీలు విడుదల వారిగా అమలు చేస్తామని అన్నారు. ఈనెల 11 నుండి గృహలక్ష్మి పథకంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని, పెద్దపల్లి నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, ఎంపీపీ కూనారపు రేణుకా దేవి, ఎమ్మార్వో యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, చీకట్ల మొండయ్య,నరసింహారెడ్డి,రంగు మల్లేష్ గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైని కలిసిన బిజెపి నాయకులు



**సంగెం, మార్చి 07 (పీ సి డబ్ల్యూ న్యూస్):** సంగెం మండల పోలీస్ స్టేషన్ కు ఇటీవల నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సబ్ ఇన్స్పెక్టర్ లావుడియా నరేష్ ను గురువారం మర్యాదపూర్వకంగా భారతీయ జనతా పార్టీ సంగెం మండల అధ్యక్షులు బుట్టి కుమారస్వామి బిజెపి నాయకులతో కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మొలు గురి శ్రీనివాస్( చౌకీదారు ) మాజీ మండల అధ్యక్షులు వడ్డే దేవేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పోలబోయిన పైడి, సంగెం మండల ప్రధాన కార్యదర్శులు కీసర వీరయ్య,భూక్యా వెంకన్న, జిల్లా గొర్ల కాపరి కన్వీనర్ జక్కచరాలు, మండల కార్యదర్శి అచ్చ రాజు శక్తి కేంద్ర ఇన్చార్జిలు గోనె ముకుందం, పవన్ సాయి, సంగెం బూత్ అధ్యక్షులు స్వాగత్,భార్గవ్,కాగితాల రమణాచారిలు పాల్గొన్నారు.

# 11న ఐటిఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా

**- పెద్దపల్లి ఐటిఐ ప్రిన్సిపాల్ ఏ.నరసింహాచారి**



**పెద్దపల్లి జిల్లా, మార్చి07 (పిసిడబ్ల్యూ న్యూస్):**మార్చి 11న ఐటిఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నా మని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహా చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ ఆధ్వర్యంలో మార్చి 11న సోమవారం ఉదయం 9-30 గంటలకు పెద్దపెల్లిలోని ప్రభుత్వ ఐ.టి.ఐ. నందు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ మేళాకు హైదరాబాద్, కరీంనగర్ నుండి పలు కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు.ఐ.టి.ఐ. పాసైన అభ్యర్థులు, పాస్ అయి అప్రెంటిస్ షిప్ రాని అభ్యర్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గల అభ్యర్థులు www.apprenticeship.india.gov.in అనే వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొని సరియైన ధృవపత్రాలతో (ఎస్.ఎస్.సి , ఐ.టి.ఐ., బయోడేటా, ఆధార్ కార్డ్ , రెండు ఫోటోలు, బ్యాంక్ అకౌంట్) పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐలో మార్చి 11న హాజరు కావాలని ఐటిఐ ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జమ్మికుంటలో దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్

**- రైల్వేశాఖకు కృతజ్ఞతలు తెలిపిన బండి**

**కరీంనగర్,మార్చి07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ప్రజలకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న చిరకాల వాంఛ నెరవేర్చనుంది. సికింద్రాబాద్- దాణాపూర్ ఎక్స్ ప్రెస్ రైలు (12791/92) ఈనెల 12 నుంచి జమ్మికుంటలో ఆగనుంది. ప్రతిరోజు ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య జమ్మికుంటలో ఈ రైలు ఆగనుంది. దాణాపూర్ ఎక్స్ ప్రెస్‌ను జమ్మికుంటలో ఆపేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యాసాధ్యాలపై రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో స్వయంగా మాట్లాడారు. తప్పనిసరిగా జమ్మికుంటలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ నుంచి దాణాపూర్ వెళ్లే ఎక్స్ ప్రెస్ రైలును జమ్మికుంట స్టేషన్‌లో ఆగేలా ఏర్పాట్లు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల 25 నిమిషాలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే దాణాపూర్ ఎక్స్ ప్రెస్ ఖాజీపేట మీదుగా జమ్మికుంట చేరుకోనుంది. ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య జమ్మికుంటలో ఈ రైలు ఆగుతుంది. అక్కడి నుంచి పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్ నగర్, బల్లార్షా, చంద్రాపూర్, నాగపూర్ మీదుగా జబల్ పూర్, సాత్నా, వారణాసి(కాశీ), బక్సర్ మీదుగా 5 రాష్ట్రాలు ప్రయాణించి దాణపూర్ చేరుకుంటుంది. జమ్మికుంటతో కలిసి మొత్తం 30 స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. దాదాపు 34 గంటలపాటు నడిచే ఈ రైలు 1830 కి.మీలు ప్రయాణించనుంది. మహారాష్ట్రలోని నాగపూర్‌తోపాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీ వెళ్లాలనుకునే ప్రయాణీకులకు దాణాపూర్ ఎక్స్ ప్రెస్ ఎంతో ఉపయోగపడనుంది. దాణాపూర్ నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు రాత్రి 9.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనుంది. ప్రయోగాత్మకంగా మాత్ర మే ఈ రైలును జమ్మికుంటలో ఆపుతున్నామని, ప్రయాణీకుల రద్దీ, డిమాండ్‌ను బట్టి రెగ్యులర్‌గా నడిపేలా చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. దాణాపూర్ ఎక్స్ ప్రెస్ రైలును జమ్మికుంటలో ఆపడంపై బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైల్వే శాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. నాగపూర్, కాశీ సహా ప్రసిద్ధ పట్టణాలతోపాటు 5 రాష్ట్రాలకు వెళ్లాలనుకునే ప్రయాణీ కులంతా ఈ రైలును వినియోగించుకోవాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు రైల్వే శాఖ నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేశారు. దాణాపూర్ ఎక్స్ ప్రెస్‌తో కాశీ, నాగపూర్ వంటి పట్టణాలకు నేరుగా వెళ్లే అవకాశం కలిగిందని, తద్వారా ఎంతో సమయం, డబ్బు ఆదా అవుతాయని అభిప్రా యపడ్డారు. తమ విజ్ఞప్తికి స్పందించిన బండి సంజయ్‌కు, రైల్వే శాఖకు ధన్యావాదాలు తెలిపారు.



# మొండ్రాయి శివాలయ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలి

**- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతి పత్రం అందించిన శివాలయ కమిటీ సభ్యులు**







**సంగెం,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగెం మండలం మొండ్రాయి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ) సంధ్యా రాణి ని కలిసి గ్రామంలో 1200 సంవత్సారాల క్రితం ఉన్న శివాలయాన్ని పునర్నిర్మాణంలో భాగంగా నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో కమిటీ సభ్యులను కబ్జాదారుడు వీరగోని రమేశ్ దంపతులు, తాళ్లపెల్లి యశోద లు ఇష్టం వచ్చినట్లు కమిటీ సభ్యులను తిడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మార్వో రాజ్ కుమార్ , ఆర్డిఓ ఆఫీసర్ , ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించడం జరిగినది. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందించి గుడి స్థలం విషయంలో వెంటనే ఆర్డిఓ ఆఫీసర్, మండల తాసిల్దార్ కి ఫోన్ చేసి తక్షణమే చర్యలు చేపట్టి గుడి స్థలాన్ని రక్షించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కి ఎమ్మెల్యే ఆదేశించడం జరిగింది. గుడి స్థలం విషయంలో ప్రైవేటు వ్యక్తులు ఎవరు అడ్డు వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ కు అందించి తమ అవేదన వ్యక్తం చేశారు. త్వరగా శివాలయ భూమిని కబ్జాదారుల నుండి రక్షించి గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన శివాలయ నిర్మానం జరిగేటట్లు ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్ ను కొరారు. అదనపు కలెక్టర్ సంధ్య రాణి మాట్లాడుతూ...త్వరలో మొండ్రాయి గ్రామాన్ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకొని గుడి నిర్మాణానికి చేపట్టవలసిన చర్యల గురించి నిర్ణయం, కబ్జాదారులపై కఠీన చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చెవ్వ మొగిలి, ఉపాధ్యక్షులు కడుదురి సంపత్,పరికి యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్స్ కక్కెర్ల వీరస్వామి,మడత కేశవులు,ప్రధాన కార్యదర్శి పెండ్లి పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి చెవ్వ బాలకృష్ణ,కోశాధికారి పెండ్లి రమేశ్, సహాయ కోశాధికారి కొనకటి కమలాకర్,ప్రచార కార్యదర్శిలు వేల్పుల కుమారస్వామి,పొన్నాల హరీష్,గూడ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేసే ప్రభుత్వం

**- ఆత్మకూర్ పిఎసియస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్**



**ఆత్మకూర్, మార్చి 07 (పీసిడబ్ల్యూ న్యూస్):** ఆత్మకూర్ మండల కేంద్రంలో పి.ఎ.సి.యస్ చైర్మెన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అతను మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో భాగంగా అమలు చేసిన గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు పేదలకు జీరో బిల్లులు రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పని చేసే ప్రభుత్వం అని సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని గత ప్రభుత్వం ఇచ్చిన హామిలను నేరవేర్చకపోగా ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అవహేలన చేస్తూ అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శిస్తున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న మహలక్ష్మి, గృహజ్యోతి, 500 కే గ్యాస్ సిలిండర్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.గత ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ ఉద్యోగ నోటిఫికేషన్ వేయకపోగా గొర్లు, బర్లు ఇస్తూ నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసారు, ఇప్పటి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన 100 రోజులలోనే 30 వేల ఉద్యోగాల నియమాక పత్రాలు అందచేయడం సంతోషం అన్నారు. త్వరలోనే రైతులకు 2లక్షల రుణమాఫీ కూడా అమలు చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసిందని, మార్చి 11 వ తేదిన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ప్రారంభించి ప్రజల కళలను, సాకారం చేయబోతుందని తెలిపారు. పేదింటి మహిళలకు గృహలక్ష్మి పథకం ద్వారా నెలకు 2500 రూ? కూడా అందచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసేందని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామిని నేరవరుస్తుందని తెలిపారు, కావున వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ను గెలిపించి రాహూల్ గాంధీని ప్రధాని చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం లో తెలంగాణ ఇంకా అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని కావున వచ్చే పార్లమెంట్ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఈ సంధర్భంగా రవీందర్ తెలిపారు.

# భారతదేశంలో మహిళా సాధికారత సాధించడమే బిజెపి లక్ష్యం

**- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ**









**గీసుగొండ, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** గీసుకొండ మండల కేంద్రంలోని ఊకల్ హవేలీ సమీపంలో ఎస్. ఎస్ గార్డెన్ నందు పరకాల నియోజకవర్గం స్థాయి నారీ శక్తి వందన్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారీ శక్తి వందన్ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. నరేంద్ర మోడీ, భారత ప్రభుత్వం గత 9 న్నర సంవత్సరాలుగా రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా మహిళల అభ్యున్నతికి, సాధికారతను సాధించడమే లక్ష్యంగా చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాల ను తెలియజేయడాని కి నరేంద్ర మోడీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఏర్పాటు చేయబడినటువంటి ఎల్ ఈ డి స్క్రీన్ ద్వారా డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలను మహిళా మోర్చా కార్యకర్తలను యువతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ....పేద ప్రజలకు అందరికీ ఉచిత రేషన్ ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ప్రతి పిల్లలు చదువుకోడానికి, వారి సంరక్షణ కొరకై బేటి బచావో బేటి పడావో తో పాటు సుకన్య సమృద్ధి యోజన,వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి ముద్ర లోన్లు అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వందరోజుల పథకము మరీ ముఖ్యంగా శాసనసభ,పార్లమెంట్ చట్టసభలలో మహిళల యొక్క సాధికారతే లక్ష్యంగా 33 శాతం రిజర్వేషన్ బిల్లును పాస్ చేసి వారి కి చట్టసభలలో ప్రాతినిధ్యాన్ని పొందే అవకాశం బిజెపి ప్రభుత్వం కల్పించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పేసరు విజయ్ చంద్ర రెడ్డి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించి వచ్చిన మహిళా సోదరీ మణులకు వివరించడం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండారి కళ్యాణి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కత్తి హేమలత 16 డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్య, కర్నకంటి రజిత, బిజెపి మండల అధ్యక్షులు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, సంగెం మండల అధ్యక్షులు బుట్టి కుమారస్వామి 15వ డివిజన్ అధ్యక్షులు బిల్లా రమేష్, పరకాల నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, వరంగల్ జిల్లా కార్యదర్శి మోలుగురి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల వెంకన్న, భూక్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పోటీ ప్రపంచంలో మహిళలు అన్నీ రంగాలలో రాణించాలి

**- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు**





**పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్: మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళలు అన్నీ రంగాలలో రాణించాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణించేలా ఉన్నారని అందుకు అనుగుణంగా ముందుకు రావాలని ఆకాశాన్ని సైతం తాకే దృఢ సంకల్పంతో మహిళలు ఉన్నారని ప్రస్తుతం ప్రతి రంగంలో మహిళలు రాణిస్తున్నారని రానున్న రోజుల్లో మరిన్ని రంగాలలో రాణించే విధంగా కృషి చేయాలన్నారు అనంతరం మహిళలకు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కిట్టి పార్టీ కార్యక్రమాలలో మహిళలు పాల్గొని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు అనంతరం వారిని ప్రోత్సహించి వారికి బహుమతులు అందించారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ పాఠశాల ప్రిన్సిపాల్ మమత ఇంచార్జ్ రాధిక పిపిటి ఇంచార్జ్ మానసలతోపాటు మహిళలు ఉపాధ్యాయినీలు పలువురు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చే శక్తి నేటి విద్యార్థులే: ఎమ్మెల్యే రేవూరి

**పరకాల, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజాన్ని మార్చే శక్తి నేటి విద్యార్థులపై ఉందని అందుకు సమాజంలో మార్పు చైతన్యం తీసుకురావడానికి విద్యాసంస్థలు నాంది పలకాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక గణపతి డిగ్రీ కళాశాల ఆవరణంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడంతో విద్యార్థులు కవాతు చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్దేశకులు విద్యార్థులే అంటూ ప్రజల్లో చైతన్యం వస్తేనే రాజకీయాలలో డబ్బు ప్రభావం తగ్గుతుంది అందుకు మార్పు రావాలంటే విద్యార్థి శక్తి సమాజానికి మూలం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు కృషి చేస్తానంటూ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉన్నత విద్య చదవడానికి అవకాశం కల్పిస్తే నేడు ఎంతోమంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అదే విధంగా ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి 10 సంవత్సరాలు ప్రజలు అవకాశం ఇస్తే 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మిగిల్చడం తన దారుణమని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించి విద్యాసంస్థల తో పాటు విద్యార్థుల అభివృద్ధికి పాటుపడేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని అన్నారు .అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# గ్రామ సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు సమిష్టితో కృషి చేయాలి

**- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**




**పరకాల, మార్చి7 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజా పాలకులు, అధికారులు సమిష్టితో కృషి చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో పెద్ది ఆంజనేయుల అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రేవుల ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ గ్రామాల వారిగా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను పాలకులు, అధికారులు అడిగి తెలుసుకుని ప్రత్యేక చూపాలన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని అన్నారు .రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేసి ప్రతినిధులు, అధికారులు బాధ్యతయుతంగా మసులుకొని ప్రజల పట్ల అభిమానాన్ని పొందాలని అన్నారు .మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల శాఖల అధికారులచే సమస్యలను తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పనులు చేసినప్పుడే ప్రజల అభివృద్ధి జరుగుతుందని అప్పుడే ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని అన్నారు.

**తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టాలి**

వచ్చే వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దటి రాకుండా పాలకులు ,అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ అందుకు అవసరమైన త్రాగునీటి ఎద్దడికి ఓపెన్ వెల్లి నుండి డైరెక్ట్గా నీటి పంపింగ్ చేయుటకు ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా 24 . 50 లక్షల ను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని ,విద్యుత్ శాఖ అధికారులు కరెంటు అంత రాయం కలగకుండా కరెంటు లైన్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు 16 లక్షల నిధులను సిడిఆర్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు.